తొలి సమయం
శనివారం । 30 । మే । 2026

## ఉద్యోగ ఉపాధ్యాయుల ఆరోగ్య పథకం జీవో విడుదల చేయాలి

### పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటించాలని టిపిటిఎఫ్ డిమాండ్






**తొలి సమయం, ఇల్లందు;మే , 29:**
ఉద్యోగ ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించిన విధివిధానాల జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇల్లందులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఫిట్మెంట్ ప్రకటించాలని కోరారు. హెల్త్ కార్డులకు సంబంధించి చికిత్సలు, ఆసుపత్రులు, కమిటీ సభ్యులు, నిధుల వినియోగంపై స్పష్టతనిస్తూ జీవో విడుదల చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జూన్ 5న హైదరాబాద్ సుందరయ్య పార్క్ వద్ద జరిగే విద్యా పరిరక్షణ ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్యపై దుష్ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్ నాయకులు



**తొలి సమయం, ఇల్లందు: మే , 29:**
ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన కుటుంబ సభ్యులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య, నిరాధార ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబును కలిసి, ఎమ్మెల్యే గౌరవాన్ని దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు సిలువేలు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్ పాషా, గిన్నారపు రాజేష్, సత్తాల హరీష్ తదితరులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రజా ప్రతినిధి ఎదుగుదలను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాలను వెంటనే ఆపకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## జోగుగూడెం గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందనలు





**తొలి సమయం, కామేపల్లి; మే29:**
కామేపల్లి మండలంలోని జోగుగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ కాంగ్రెస్ కమిటీని ఇల్లందు ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య అభినందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుజ్జర్లపూడి రాంబాబు నియామకం అనంతరం మండలంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన గ్రామ కాంగ్రెస్ కమిటీ ఇదేనని నాయకులు తెలిపారు. శుక్రవారం జోగుగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచన మేరకు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, టీపీసీసీ సభ్యుడు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, తోటకూరి శివయ్య, ధనియాకుల హనుమంతరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆరెం రవి, ఏఎంసీ డైరెక్టర్ గబ్రు నాయక్, సరిరాం నాయక్ సమక్షంలో గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ సంఘ భవనానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఇస్లావత్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజ్మీర భీముడు, జరపల రవీందర్, వైస్ ప్రెసిడెంట్‌గా ధరావత్ సుక్య, జనరల్ సెక్రటరీగా జరపల బన్సీలాల్, కార్యదర్శిగా దారావత్ బద్యతో పాటు కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్గాలకతీతంగా ప్రతి ఇంటికి చేరేలా కృషి చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు జరపల కుమార్, బానోత్ రాజకుమార్, జరపల నెహ్రూ, మాళోత్ కుమార్, జరపల వినాయకుడు, భూక్య విజయ్, అజ్మీర సురేష్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు బొడ్డు లక్ష్మీనారాయణ, సింగం వెంకన్న, సిరిపురపు కోటయ్య, పుచ్చకాయల అప్పారావు, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జరపల లక్ష్మణ్ నాయక్, హట్కర్ శంకర్, జరపల ఫుల్‌సింగ్, భూక్య లక్ష్మణ్‌తో పాటు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## సమ్మెకు పీవైఎల్ సంఘీభావం

**తొలి సమయం, ఇల్లందు: మే , 29:**
వీఓఏలు గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు వాంకుడోతు మోతిలాల్ విమర్శించారు. ఇల్లందులో ఎంఆర్వో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న వీఓఏల దీక్షా శిబిరాన్ని సందర్శించి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వీఓఏలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, జీఓ నెం.58 అమలు చేసి కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, హెచ్ఆర్ అమలు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే వీఓఏలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకుడు యాదగిరి, వీఓఏ జేఏసీ నాయకులు కొక్క, పృధ్వి, రవి, సునీల్, రాంబాబు, గీత తదితరులు పాల్గొన్నారు.



## వీఓఏల సమ్మెకు బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం



**తొలి సమయం, ఇల్లందు ;మే, 29:**
ఐకేపీ, సెర్ప్ అనుబంధ వీఓఏల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె, నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్న సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఇల్లందులోని దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు వీఓఏల వేతనాలు పెంచాలని, జీఓ నెం.58 సవరణ చేయాలని, అర్హులైన వీఓఏలను కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. వీఓఏల జేఏసీ నాయకురాలు నవ్య సమ్మెకు గల కారణాలను బీఆర్ఎస్ ప్రతినిధి బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ నబీ, నారపాక వసంతరావు, పరికపల్లి రవి గౌడ్, రాచపల్లి శీను, సన రాజేష్, మూలగుండ్ల ఉపేందర్ రావు, లలిత్ కుమార్ పాసి, వంగ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.